ప్రజాశక్తి
ఆదివారం 16 మార్చి 2025
5
అనంతపురం





సిపిఎం నాయకులను బలవంతంగా అరెస్టు చేస్తున్న పోలీసులు

ఫ్రీకాట్ మిల్లు మూసివేతపై ఎమ్మెల్యే బాలకృష్ణ స్పందించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి. రాంభూపాల్



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి. రాంభూపాల్

ప్రజాశక్తి - పరిగి

సత్య సాయి జిల్లా పరిగి మండలంలోని కోడిగినహళ్లి వద్ద గల ఫ్రీకాట్ మిల్లు మూసివేత నిర్ణయంపై స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ స్పందించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. సత్య సాయి జిల్లా పరిగి మండలంలోని కోడిగినహళ్లి ఫ్రీ కాట్ బి యూనిట్‌ను రాంభూపాల్ పార్టీ నాయకులతో కలసి శనివారం పరిశీలించారు. అనంతరం కార్మికులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతమైన ఉమ్మడి అనంతపురం జిల్లా కరువు కాటకాలతో కొట్టుమిట్టాడుతున్న సమయంలో పరిశ్రమలకు ప్రత్యేక రాయితీలు కేటాయించి ఇక్కడ ప్రాంత ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఉద్దేశంతో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు హిందూపురం ప్రాంతంలో ఫ్రీకాట్ మిల్లు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారన్నారు. 42 సంవత్సరాలుగా ఎన్నో కుటుంబాలకు జీవనోపాధి కల్పించి కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపిన పరిశ్రమను నేడు మూసివేసేందుకు యాజమాన్యం ప్రయత్నిస్తోందన్నారు. అందులో భాగంగా కార్మికులపై పలు రకాలుగా ఒత్తిడి తీసుకొస్తోందన్నారు. అయితే ఇప్పటివరకు కార్మికులు అనేక రూపాల్లో ఉద్యమాలు నిర్వహించారని అయినప్పటికీ పరిశ్రమను పున: ప్రారంభించడానికి ముందుకు రాకపోవడం బాధాకరమని అన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకొస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం ఉన్న పరిశ్రమలను కాపాడుకోలేకపోవడం సిగ్గుచేటు అన్నారు. మిల్లు మూసివేతకు ప్రభుత్వ నిర్ణయాలే కారణమని యాజమాన్యం చెబుతోందని ఇందుకు తగిన విధంగా ప్రభుత్వమే బాధ్యత వహించి మిల్లు పునర్ ప్రారంభానికి యాజమాన్యంతో చర్చలు జరిపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నూలు పరిశ్రమ కొనసాగించడం సాధ్యం కాదని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఇక్కడ సుంకాల విషయంలో 30 నుంచి 40శాతం వరకు ఎక్కువ చెల్లించాల్సి వస్తోందన్నారు. అంతేకాకుండా పరిశ్రమ ప్రతినెల కోటి రూపాయలు వరకు కరెంట్ చార్జీలు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొందని యాజమాన్యం తమ దృష్టికి తీసుకు వచ్చిందని తెలిపారు. అంతేకాకుండా ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ముడిసరుకు ధరలు ఇక్కడ ఎక్కువగా ఉన్నాయని చెబుతున్నారన్నారు. తమిళనాడు, కేరళ రాష్ట్రాలలో పరిశ్రమలకు ప్రత్యేక రాయితీలు కేటాయిస్తూ పరిశ్రమల అభివృద్ధికి చేయూతను ఇస్తున్నాయన్నారు. అయితే ఇక్కడ ఆ పరిస్థితి లేదన్నారు. పాత పరిశ్రమలు ఇప్పుడున్న స్థితిలో నష్టాలను భరిస్తూ ఉత్పత్తిని పరిశ్రమలో కొనసాగించే పరిస్థితి లేదని ఇప్పటికే నష్టాల పూడ్చుకొని బ్యాంకు రుణాలు చెల్లించే పరిస్థితిలో కూడా లేమని యాజమాన్యం తమ దృష్టికి తీసుకువచ్చిందని రాంభూపాల్ తెలిపారు. వీటికి కార్మికులు కారణం కాదని అయితే మిల్లు మూతపడితే కార్మిక కుటుంబాల రోడ్డున పడతాయని వారిని నమ్ముకున్న పిల్లలు, తల్లిదండ్రుల జీవితాలు చిన్నభిన్నమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి సమయంలో ప్రభుత్వం బాధ్యత తీసుకొని కార్మికులకు పూర్తి భరోసాతో పాటు న్యాయం చేసే విధంగా ముందుకు రావాల్సి ఉందన్నారు. హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ తక్షణమే ఈ సంఘటనపై స్పందించాలన్నారు. ప్రభుత్వం యాజమాన్యంతో చర్చించి కార్మికులకు న్యాయం చేయాలన్నారు. తన తండ్రి తీసుకొచ్చిన పరిశ్రమను నిలుపుకోవాల్సిన బాధ్యత ఎమ్మెల్యే బాలకృష్ణపై ఉందన్నారు. వెంటనే బాలకృష్ణ చొరవ తీసుకొని కార్మికుల పక్షాన యాజమాన్యంతో మాట్లాడి మిల్లు కొనసాగింపునకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఈఎస్ వెంకటేష్, ఫ్రీ కాట్ మిల్ యూనియన్ కార్యదర్శి జెడ్పి శ్రీనివాసులు, చిలమత్తూరు సిఐటియు నాయకులు ఫిరంగి ప్రవీణ్ తదితర నాయకులతో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

హంద్రీనీవా కాలువ లైనింగ్ నిలిపివేయాలి

సోమందేపల్లి : హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులను వెంటనే నిలుపుదల చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాంభూపాల్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు చేయాలని బడ్జెట్లో ప్రవేశపెట్టడం జరిగిందని ఇది రైతులకు చేస్తున్న పెద్ద ద్రోహం అని విమర్శించారు. లైనింగ్ పనుల వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోయి సత్య సాయి జిల్లా ఎడారిగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ లైనింగ్ పనులకు పెట్టే ఖర్చుతో కాలువను వెడల్పు చేసి మారుమూల ప్రాంతాలకు కూడా హంద్రీనీవా కాలువ ద్వారా నీటిని తీసుకువెళ్లాలని డిమాండ్ చేశారు. కాలువను వెడల్పు చేయడం వల్ల కాలవలో నీటి సామర్థ్యం పెరిగి చుట్టుపక్కల ప్రాంతాలలో ఉన్న రైతుల బోరుబావుల్లో పుష్కలంగా భూగర్భ జలాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేని కాంట్రాక్టర్లకు లాభం కూర్చే లైనింగ్ పనులను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం హంద్రీనీవా కాలువ లైనింగ్ నిలుపుదల చేయాలని సోమందేపల్లి మండల కమిటీ తీర్మానం చేసిందని ఈ నిర్ణయాన్ని జిల్లా కమిటీ, రాష్ట్ర కమిటీ మద్దతు తెలియజేస్తుందని తెలియజేశారు. అనంతరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈ ఎస్ వెంకటేష్ మాట్లాడుతూ ఉపాధి కూలీలకు 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి దాదాపు పది వారాల నుంచి ఉపాధి కూలీలకు కూలి జమ కాలేదని ప్రభుత్వం వెంటనే ఉపాధి కూలీల నిధులు వారి ఖాతాలో జమ చేయాలని కోరారు. పని ప్రదేశాలలో మజ్జిగ, నీరు, ఒఆర్ఎస్ ప్యాకెట్లు, నీడను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పది వారాలుగా ఉపాధి కూలీ ప్రజలకు అందలేదని దీనిపై మండల అభివృద్ధి అధికారి కార్యాలయం వద్ద ఉపాధి కూలీలతో కలిసి ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వడ్డే రంగప్ప, హనుమయ్య, వెంకటేష్, రాజగోపాల్, లక్ష్మీనారాయణ, వెంకటేష్, కొండ వెంకటేష్, రవి, కిష్టప్ప, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

అనంతపురం రూరల్ పాపం పేట గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న సర్వే నెంబర్ 106-1లో శనివారం ఉదయం కొందరి గృహాలను అధికారులు కూల్చివేయడం అన్యాయమని బాధితులను న్యాయం చేయాలని సిపిఎం నగర కార్యదర్శి రామి రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ముత్తుజ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాపం పేట గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న సర్వే నెంబర్ 106-1లో కొన్ని కుటుంబాలు 40 సంవత్సరాల క్రితం గృహాలు నిర్మించుకుని జీవనం చేస్తున్నారన్నారు. అయితే రెవెన్యూ అధికారులు హైకోర్టు తీర్పు అని చెబుతూ శనివారం ఉదయం వందల మంది పోలీసులను తీసుకువచ్చి బాధితులను భయభ్రాంతులకు గురిచేసి బలవంతంగా ఇళ్లను కూల్చివేశారని విమర్శించారు. అధికారుల చర్య సమంజసం కాదన్నారు. బాధితులను పరామర్శించడానికి వెళ్లిన తమను కూడా అక్రమంగా అరెస్టు చేసి రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారన్నారు. కొన్ని ఏళ్లుగా అక్కడే నివాసముంటూ ఇంటి గుత్తలు కడుతూ, పంచాయతీ అధికారులు అప్రూవల్ ప్రకారం ఇల్లు కట్టుకొని జీవనం చేస్తున్న వారిని భయభ్రాంతులకు గురిచేసి వారి ఇళ్లను కూల్చివేయడం అమానుషమన్నారు. హైకోర్టు పేరు చెప్పి బాధితులను బలవంతంగా పంపించడం పద్ధతి కాదని తెలిపారు. ఈ మధ్యకాలంలో భూములకు విలువ పెరిగిన తర్వాత చిన్న చిన్న లోసుగులు ఆసరా చేసుకుని కోర్టులలో వేసి పేదలను బలవంతంగా భూముల నుండి తరిమి వేసే చర్యలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. గృహాల కూల్చివేతపై ఆర్డీవో స్పందించకపోవడం భావ్యం కాదన్నారు. అదేవిధంగా కోర్టు తీర్పులను తాము అమలు చేస్తున్నామని చెప్పే అధికారులు 2018 సంవత్సరంలో సెంట్రల్ పార్క్ స్థలాన్ని కబ్జా చేసిన వారి నుండి కాపాడి ఆ స్థలాన్ని మున్సిపల్ అధికారులకు అప్పగించాలని సుప్రీంకోర్టు తీర్పు చెప్పిన ఇప్పటిదాకా సెంట్రల్ పార్కు స్థలాన్ని సర్వే చేసిన పాపాన పోలేదని విమర్శించారు. దీనికి కారణం సెంట్రల్ పార్కు స్థలంలో రాజకీయ నాయకులతో పాటు, డబ్బు, అధికారం ఉన్న వారు ఉండటమేనని అన్నారు. అందుకే అధికారులు ఆ స్థలం జోలికి వెళ్లడం లేదన్నారు. అదే విధంగా పాపం పేట పంచాయతీలో వందల ఎకరాల భూములకు లిటిగేషన్లు ఉన్నాయని ప్రచారం జరుగుతున్నా అధికారులు ప్రజలను అప్రమత్తం చేయడంలో విఫలమవుతున్నారని విమర్శించారు.



డిఎంహెచ్ఒ ఇబి.దేవికి వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

ఆశావర్కర్‌కు మెరుగైన వైద్యం అందించాలి

సిఐటియు ఆధ్వర్యంలో డిఎంహెచ్ఒ కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆశావర్కర్ పద్మావతికి మెరుగైన వైద్యం అందించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. ఆశావర్కర్ పద్మావతిని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఆశా కార్మికులు, సిఐటియు ఆధ్వర్యంలో శనివారం డిఎంహెచ్ఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు మాట్లాడుతూ శింగనమల మండలం తరిమెల పిహెచ్‌సిలో పద్మావతి ఆశా కార్యకర్తగా పని చేస్తోందన్నారు. విధి నిర్వహణలో ఉండగా అక్కడి హెల్త్ అధికారులు వ్యాక్సిన్ క్యారెర్ సలకం చెరువు గ్రామానికి వెళ్లి తీసుకుని రావాలని పంపించారని తెలిపారు. ఈ పని ఆశావర్కర్‌కు సంబంధం లేదన్నారు. అధికారులు వేధింపులు భరించలేక తన కొడుకుని తీసుకుని బండి మీద వ్యాక్సిన్ క్యారియర్ తీసుకొస్తుండగా ప్రమాదానికి గురైందన్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందన్నారు. తలలో రక్తం గడ్డ కట్టడం వలన మెరుగైన వైద్యం కోసం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి పంపించారని. మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రమాదం జరిగితే 6 గంటలైనా మెరుగైన వైద్యం అందించడం లేదన్నారు. ఆశాల కార్యకర్తల పట్ల ఈ సంఘటన బట్టి చూస్తే అధికారులు నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో అర్థం అవుతుందన్నారు. తమకు సంబంధం లేని పనులన్నీ ఆశాలతో చేయిస్తున్నారని విమర్శించారు. ఏఎన్ఎంలు చేయాల్సిన సర్వేలు, ఆశాలతో చేయిస్తున్నారని తెలిపారు. పద్మావతి ఆరోగ్యంగా కోలుకునే వరకు ప్రభుత్వమే వైద్య ఖర్చులు భరించాలని, మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఇందుకు స్పందించిన డిఎంహెచ్ఒ ఇబి దేవి పద్మావతికి మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా చూసుకుంటామని ఆశలకు సంబంధంలేని పనులు చేయించకుండా మెడికల్ ఆఫీసర్లకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షురాలు ఎం.నాగమణి, జిల్లా కోశాధికారి గోపాల్, ఉపాధ్యక్షులు రామాంజనేయులు, నాగభూషణం, ఏటీఎం.నాగరాజు, నగర నాయకులు ఆజాం బాషా, ఎర్రిస్వామి, తిరుమలేశు, ఆశ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు సౌజన్య, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆత్మహత్య

ప్రజాశక్తి - బుక్కరాయసముద్రం



మృతురాలు యోజిత సహో (ఫైల్‌ఫొటో)

అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం జంతులూరు వద్ద ఉన్న సెంట్రల్ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న యువతి శనివారం ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనకు సంబందించి స్థానికులు, యూనివర్సిటీ వర్గాలు తెలిపిన వివరాలు.. చత్తీస్‌ఘడ్‌కు చెందిన యోజిత సహో(26) స్థానిక సెంట్రల్ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తోంది. యూనివర్సిటీ సమీపంలో గదికి అద్దెకు తీసుకుని విధులకు హాజరవుతుండేది. ఈ నేపథ్యంలో యోజిత సహో శనివారం తాను అద్దెకు ఉన్న గదిలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయాన్ని మృతురాలి బంధువులకు సమాచారమిచ్చామని వారు వచ్చి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని సిఐ కరుణాకర్ తెలిపారు.

పెన్నానదిలో నీట మునిగి ఇద్దరు బాలికలు మృతి

ప్రజాశక్తి - అనంతపురం



మృతులు అరుణి, లక్ష్మి

అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం కల్లూరు సమీపంలో పెన్నానది పరివాహక ప్రాంతంలోని నీటిగుంతలో పడి ఇద్దరు బాలికలు మృతిచెందారు. ఈఘటనకు సంబందించి స్థానికులు తెలిపిన వివరాల మేరకు ... సంచార జాతులకు చెందిన ఓ కుటుంబం కల్లూరులో నివాసముంది. ఈ నేపథ్యంలో ఆ కుటుంబానికి చెందిన అరుణి(9), లక్ష్మి (13) శనివారం తమకు చెందిన ఆవులను మేతకోసం సమీపంలోని గుట్టల్లోకి తీసుకెళ్లారు. మేత మేసిన పశువులు సమీపంలో ఉన్న పెన్నానది పరివాహక ప్రాంతమైన నీటి గుంత వద్దకు నీరు తాగడానికి వెళ్లాయి. ఆ సమయంలో ఆవులు గుంతలోకి దిగుతుండగా వాటిని నివారించే ప్రయత్నంలో అరుణి, లక్ష్మి నీటిగుంతలోకి దిగారు. గుంత లోతు ఎక్కువగా ఉండటంతో పిల్లలిద్దరూ అందులో మునిగిపోయారు. ఈసందర్భంగా వారు గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల దూరంగా ఉన్న వారు అక్కడి వచ్చి పిల్లలను రక్షించే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే బాలికదిద్దరూ మృతిచెందారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

19న విజయవాడలో తాగునీటి కార్మికుల ధర్నా



కరపత్రాలను విడుదల చేస్తున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, నాయకులు

అనంతపురం కలెక్టరేట్ : శ్రీసత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదిన విజయవాడలోని ధర్నా చౌక్‌లో నిర్వహిస్తున్న ధర్నాను జయప్రదం చేద్దామని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు అన్నారు. బకాయి వేతనాలు, పిఎఫ్ చెల్లించాలని కోరుతూ శ్రీసత్యసాయి కార్మికులు చేపట్టిన రిలే దీక్షలు శనివారం 6వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు హాజరై 19న విజయవాడలో చేపడుతున్న ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు.

సౌర విద్యుత్ ఉత్పత్తికి అధిక ప్రాధాన్యత

విప్ కాలవ శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్రంలో సౌర విద్యుత్ ఉత్పత్తికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని విప్ కాలవ శ్రీనివాసులు వెల్లడించారు. రాయదుర్గం నియోజకవర్గ పరిధిలోని డి.హీరేహాల్ మండలం కాదలూరు గ్రామంలో సోలార్ విద్యుత్ ప్రాజెక్ట్‌కు భూములిచ్చిన రైతులతో శనివారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ ఉపయోగ, వ్యవసాయ రంగాలతో పాటు పారిశ్రామిక రంగాల్లో విద్యుత్ వాడకం అధికం అవుతోందన్నారు. అవసరాలకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తిని పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సోలార్ ప్రాజెక్టు ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. ప్రతి ఎకరాకు ఏడాదికి రూ.31వేలు చొప్పున రైతు అకౌంట్‌కు నగదు జమ అవుతుందన్నారు. ఎన్‌టిపిసి, జిందాల్ లాంటి విద్యుత్ ఉత్పత్తి కంపెనీలకు కేవలం మీ భూములు అద్దెకు మాత్రమే ఇస్తున్నారని వివరించారు. భూమిపై అన్ని హక్కులూ రైతులకే ఉంటాయన్నారు. కావాల్సినప్పుడు భూమి ఎవరికైనా అమ్ముకోవచ్చన్నారు. కుటుంబ సభ్యులు బాగ పరిష్కారాలు కూడా చేసుకోవచ్చన్నారు. ప్రతి రెండేళ్లకు 5శాతం చొప్పున అద్దె పెంచనున్నట్లు వివరించారు. అత్యంత వెనుకపడ్డ రాయదుర్గం నియోజకవర్గంలో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి అడుగులు పడుతున్నాయన్నారు. 7500 మెగావాట్ల విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటుకు ఈ ప్రాంతంలో అవకాశాలుంటాయన్నారు. సోలారు పార్కులకు భూములు ఇవ్వటానికి స్వచ్ఛందంగా రైతు సోదరులు ముందుకు రావడం సంతోషించతగ్గ పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ విద్యుత్ ఉత్పత్తి కంపెనీల ప్రతినిధులు, నెడ్ క్యాప్ మేనేజర్ శివశంకర్, జిందాల్ ఎండి కనకారావు, టిడిపి మండల కన్వీనర్ హనుమంతురెడ్డి, నాగల్లి రాజు, తహశీల్దార్ మునివేలు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు


ప్రజాశక్తి-గుంతకల్లు



వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

దీర్ఘకాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్య దర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం సిపిఎం ఆధ్వర్యంలో 31వ వార్డు మస్తాన్ పేటలోని సుంకులమ్మ ఆలయం సమీపంలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం 28వ సచివాయాలనికి చేరుకుని అడ్మిన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుంకులమ్మ ఆలయం సమీపంలో డ్రెయినేజీ కాలువపై వేసిన సిసి రోడ్డును తొలగించి కల్వర్టు వేయాలన్నారు. డోర్ నెంబర్ 6/900-13 నుండి 6/900-5 వరకూ డ్రెయినేజీ కాలువ నిర్మాణం చేపట్టాలన్నారు. మురికి కాలువపై సిసి రోడ్డు వేయడం వల్ల మురుగునీరు కాలువలో సక్రమంగా పోవటం లేదన్నారు. దీంతో మురుగు నీరంతా రోడ్డు, ఇళ్లల్లోకి వస్తోందన్నారు. వెంటనే ఆయా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్, కార్యదర్శివర్గ సభ్యులు కసాపురం రమేష్, మస్తాన్‌పేట వాసులు షాషా, రియాజ్, దాసు, కూమార్, అనిల్, రాము, రాజు, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి మండలంలో ఉపాధి కూలీలలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు



ఉపాధి హామీ చట్టంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం జిల్లావ్యాప్తంగా స్కూటర్‌యాత్రను ప్రారంభించారు. ఇందులో భాగంగా గ్రామాల్లో పని చేస్తున్న ఉపాధి కూలీల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

స్వచ్ఛ భారత్ సాధనకు కృషి చేద్దాం : కలెక్టర్

ప్రజాశక్తి-గుంతకల్లు



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

స్వచ్ఛ భారత్ సాధనకు ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో కృషి చేద్దామని కలెక్టర్ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ అన్నిరంగాల్లో ప్లాస్టిక్ వాడుతుంటే పర్యావరణం, పరిశుభ్రత దెబ్బతింటోందన్నారు. పర్యావరణం శుభ్రంగా చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నిషేధిత ప్లాస్టిక్ నిర్మూలన ముఖ్యమైన అంశం అన్నారు. ఇంటి లోపల శుభ్రంగా ఎలాగైతే ఉంచుకుంటామో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సిఎం పిలుపుమేరకు చిత్తశుద్ధితో పరిశుభ్రత పాటించాలన్నారు. ప్లాస్టిక్ కప్పులు, ప్లేట్లు వాడి పారేశాక వర్షం వస్తే అక్కడ నీరు నిలువ ఉండి దోమలు వ్యాప్తి చెందుతాయన్నారు. ప్రజలందరి ప్రవర్తనలో మార్పు రావాలని దేశ ప్రధానమంత్రి పిలుపునిచ్చారన్నారు. ప్రవర్తనలో స్వచ్ఛత ఉండాలన్నారు. అంతకు ముందుగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ భవాని చేసిన విజ్ఞప్తి మేరకు కలెక్టర్ స్పందిస్తూ అదనపు కార్మికులను నియమించుకోవాలని,అందుకు అవసరమైన నిధులు, సహాయ సహకారాలు, ఏ సమస్యలు ఉన్నా నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ భవాని, పట్టణ టిడిపి ఇన్‌ఛార్జి నారాయణస్వామి, మున్సిపల్ కమిషనర్ నయీమ్‌అహ్మద్, ఆర్డీఓ శ్రీనివాసులు, డిఎల్‌డిఒ విజయలక్ష్మి, తహశీల్దార్ రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

సిద్ధరాంపురం పాకిస్తాన్‌లో ఉందా..?

ఖాకీలు ప్రజల కోసం పని చేయాలి

మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆత్మకూరు

ఆత్మకూరు మండలంలోని సిద్ధరాంపురం గ్రామం ఏమైనా పాకిస్తాన్‌లో ఉందా... అక్కడికి వెళ్లాలంటే వీసా తీసుకుని వెళ్లాలా..? అని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం అనంతపురం నగర శివారులోని తన నివాసంలో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాప్తాడు నియోజకవర్గంలో ప్రజలు పడుతున్న ఇబ్బందుల గురించి మాట్లాడడానికి, బాధితులను పరామర్శించడానికి వెళ్లేందుకు వెళ్తే అనుమతులు లేవని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఆత్మకూరు మండలం సిద్ధరాంపురం గ్రామంలో టిడిపికి చెందిన వారి చేతిలో గాయపడిన యువకుడు కురుబ బాలన్నను పరామర్శించేందుకు వెళ్లాలని ప్రయత్నిస్తే పోలీసులు అనుమతి లేదని చెప్పారన్నారు. మొదట అనుమతి ఇచ్చిన పోలీసులు కాసేపటికే అక్కడికి కూడా పరిటాల సునీత వస్తున్నారు.. వెళ్లేందుకు ఇబ్బందిగా ఉంటుందని అనుమతిని నిరాకరించారన్నారు. రాప్తాడుకు ప్రత్యేక రాజ్యాంగం రాస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత ఖాకీ చొక్కాల వెనుక ఉండి నడిపిస్తున్నారని ధ్వజమెత్తారు. రామగిరి ఎస్ఐగా పని చేస్తున్న సుధాకర్‌యాదవ్ పోలేపల్లికి వస్తే పెద్దపెద్ద గొడవలు అవుతాయని చెబుతున్నారు.. పోలీసులు ఉండేది ఎందుకు.? అని ప్రశ్నించారు. ఆత్మకూరు మండలం సిద్ధరాంపురంలో కులాలకు అతీతంగా హంద్రీనీవా లైనింగ్ పనులు జరగకుండా అడ్డుకోవాలని నిర్ణయించుకున్నారన్నారు. అయితే కులాలు, వర్గాలు, పార్టీలను రెచ్చగొట్టి లైనింగ్ పనులు చేయించాలని సునీత కుట్ర పన్నిందన్నారు. ఇందులో భాగంగానే కురుబ బాలన్న కాలువమీద వెళ్తుంటే కొందరిని రెచ్చగొట్టి దాడి చేయించారని ఆరోపించారు. అంత పెద్ద గాయాలై బాధితుడు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేశారు కానీ.. ఇప్పటిదాకా వారిని పట్టకొచ్చింది లేదన్నారు. అలాగే రాప్తాడు సిఐ హర్ష 'నేను గుండీలు ఇప్పుతా.. రా కొట్లాడదాం' అని పిలుస్తాడన్నారు. ఆయన సిఐనా.. రౌడీనా అర్థం కావడం లేదన్నారు. 'నువ్వు కేసులు కట్టుకుంటావా కట్టుకో... మాకు జైలు కొత్త కాదు.. బెయిలూ కొత్తకాదు...' అని అన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రీ సర్వే పెండింగ్ భూముల పరిశీలన

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండల పరిధిలోని గుండిగానిపల్లి గ్రామంలో జరుగుతున్న రీసర్వే పనులను తహశీల్దార్ సుమతి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ గుండిగానిపల్లి గ్రామ సచివాలయ పరిధిలో 53 సర్వే నెంబర్లు ఉన్నాయన్నారు. ఇందులో దాదాపు 360 మంది రైతులకు 930 ఎకరాల భూమి ఉందన్నారు. ఇందుకు స్థానిక అధికారులు స్పందిస్తూ గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వ్యాల్యుయేషన్ కింద ఇప్పటి వరకు 500 ఎకరాలలో రీ సర్వే పనులు పూర్తయ్యాయన్నారు. తక్కిన సర్వే నెంబర్లు కూడా త్వరితగతిన రీ సర్వే ను పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ నాగిరెడ్డి, వీఆర్వో ఆంజనేయులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.


రీసర్వే భూముల రైతులతో మాట్లాడుతున్న తహశీల్దార్ సుమతి

రాజకీయాల్లో 'బాబు'కు సాటిలేరు : ఎమ్మెల్యే దగ్గుపాటి

ప్రజాశక్తి-అనంతపురం

భారతదేశ రాజకీయాల్లోనే ముఖ్యమంత్రి చంద్రబాబుకు సాటి ఎవరూ లేరని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో అన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు శాసనసభలో తొలి ప్రమాణస్వీకారానికి 47 ఏళ్లు పూర్తయిన సందర్భంగా తన అభిప్రాయాల్ని వెల్లడించారు. రాష్ట్ర చరిత్రలో 41 సంవత్సరాలు ఎమ్మెల్యేగా, 15 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్న నాయకుడు మరెవరూ లేరన్నారు. భవిష్యత్తులో కూడా ఎవరూ ఉండరన్నారు. ఎప్పుడో ఒక మారుమూల ఉన్న నారావారిపల్లి నుంచి వచ్చి ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు దిక్సూచిగా మారారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆయన చేసింది ఒక ఎత్తైతే...రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి ఆయన అందించిన సేవలు అనిర్వచనీయమన్నారు. అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం ఆయన ఆయుధాలుగా మలుచుకుని ముందుకు సాగారన్నారు.

డాక్టర్ రామలింగ చౌదరికి అవార్డు

ప్రజాశక్తి-ఉరవకొండ



శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం గ్రామీణ అభివృద్ధి శాఖలో అకాడమిక్ కన్సల్టెంట్‌గా పని చేస్తున్న మండల పరిధిలోని షేక్షానపల్లి గ్రామానికి చెందిన డాక్టర్ గడపూటి రామలింగచౌదరికి భారత సామాజిక మండలి శాస్త్ర పరిశోధనా సంస్థ ద్వారా భారత మానవ అభివృద్ధి అవార్డును ప్రదానం చేశారు. ఈయన గ్రామీణాభివృద్ధి విభాగంలో విశ్రాంత ఆచార్యులు, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ మాజీ రెక్టార్, మాజీ రిజిస్ట్రార్ జి.శ్రీధర్ పర్యవేక్షణలో కరువు ప్రాంతమైన అనంతపురం జిల్లాలో వ్యవసాయ అభివృద్ధి ద్వారా గ్రామీణ ప్రజల జీవనోపాధి భద్రతను మెరుగుపరచడంపైన పరిశోధనలు చేశారు. అంతేకాకుండా పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ రంగం సంబంధాలు, సూక్ష్మ నీటి పారుదల సౌకర్యాల ప్రాధాన్యతల గురించి అనేక పరిశోధన పత్రాలను సమర్పించారు. ఇందుకు గ్రామీణ అభివృద్ధి విభాగం ద్వారా చేస్తున్న పరిశోధనలకు భారత మానవాభివద్ధి శాఖ అవార్డు లభించింది.

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని చెర్లోపల్లి గ్రామ శివారులోని కొండపై వెలసిన చెన్నకేశవ స్వామి తిరుణాల సందర్భంగా సర్పంచి అప్పా వెంకటేష్, గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో శనివారం రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల ఆధ్వర్యంలో ఉచితంగా భోజన సౌకర్యాన్ని కల్పించారు. రాతిదూలం లాగుడు పోటీల్లో కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరి గ్రామానికి చెందిన అద్దంకి మస్తాన్ వృషభాలు ప్రథమ స్థానంలో నిలిచాయి. గుంతకల్లు మండలం నల్లగొండ గ్రామానికి చెందిన అంకిత్ రామ్ వృషభాలు రెండవ, చాకలి నల్లయ్య వృషభాలు మూడవ, ఎమ్మిగనూరు మండలం గుకల్లు గ్రామానికి చెందిన నల్లయ్య వృషభాలు నాల్గవ, బొమ్మనహాల్ మండలం లింగాధల్ గ్రామానికి చెందిన ఎర్రిస్వామి వృషభాలు ఐదవ, ఉదహాళ్ గ్రామానికి చెందిన బసన్న వృషభాలు ఆరవ స్థానాల్లో నిలిచాయి. విజేతల యజమానులకు నగదు బహుమతులు అందజేశారు. అనంతరం రాతిదూలం లాగుడు పోటీల నిర్వహణకు విరాళాలు ఇచ్చిన దాతలను ఘనంగా సన్మానించారు.


రాతిదూలాన్ని లాగుతున్న వృషభాలు

రైతులకు అవగాహన

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని విరూపాక్షిరెడ్డి కన్వర్షన్ హాలులో శనివారం సేట్రీస్ ప్రాజెక్ట్, హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో అగ్రో ఫారెస్ట్రీపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పీప్సోల్ సంస్థ ప్రతినిధి పెంచల్ కుమార్, ఇస్కో సంస్థ ప్రతినిధి మహబూబ్ వలి, సేట్రీస్ ప్రాజెక్టు రీజినల్ మేనేజర్ మనోహర్ హాజరై ప్రసంగించారు. సేట్రీస్ ప్రాజెక్టు అమలు, కార్బన్ క్రెడిట్స్, పర్యవేక్షణ ఒప్పందాలు, విస్తరణ ప్రయోజనాల గురించి రైతులకు తెలియజేశారు. సేట్రీస్ ప్రాజెక్టు పీఎం పీరావలి, హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ సిఇఒ ఎం.నారాయణస్వామి మాట్లాడుతూ ఆగ్రో ఫారెస్ట్‌లో విస్తృత పరుస్తామని తెలిపారు. డ్రిప్ ఇరిగేషన్ ప్రయోజనాలను వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. అడవి జంతువుల దాడుల నివారణకు బయో ఫెన్సింగ్ పద్ధతి ఆచరించడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిఒ శివ, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

జెఎన్‌టియు ఎంటెక్ ఫలితాలు విడుదల

అనంతపురం : అనంతపురము జెఎన్‌టియు విశ్వవిద్యాలయం పరిధిలో 2024-25లో నిర్వహించిన ఎంటెక్ ఫలితాలను శనివారం విడుదల చేశారు. ఎం.టెక్ 4వ సెమిస్టర్ సప్లిమెంటరీ, ఎం.ఫార్మసీ 4వ సెమిస్టర్ 2వ సెమిస్టర్ సప్లిమెంటరీ, 1వ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ, బి.ఫార్మసీ 2వ సంవత్సరం 1వ సెమిస్టర్ రెగ్యులర్ 1వ సెమిస్టర్, సప్లిమెంటరీ 2వ సంవత్సరం 2వ సెమిస్టర్, సప్లిమెంటరీ ఫార్మా-డి 4వ, 3వ, 2వ సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ 2వ సంవత్సరం సప్లిమెంటరీ 1వ సంవత్సరం, సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ వి.నాగప్రసాద్‌నాయుడు,కంట్రోలర్ అఫ్ ఎక్సామినేషన్ ఎపి శివకుమార్, అడిషినల్ కంట్రోలర్స్ జి.శంకర్ శేఖర్‌రాజు, ఎం.అంకారావు, ఎస్.శ్రీధర్ తెలిపారు.

'ఉపాధి' కూలీల సమస్యలు పరిష్కరించాలి

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్కూటర్ యాత్ర

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉపాధి హామీ చట్టంలో పని చేస్తున్న కూలీల సమస్యలు పరిష్కరించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈమేరకూ కూలీల సమస్యలు పరిష్కరించేందుకు ఎపి వ్యకాసం ఆధ్వర్యంలో చేపట్టిన స్కూటర్ యాత్ర శనివారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయ ప్రాంగణం నుంచి ప్రారంభమైంది. ముందుగా రేణుమాకులపల్లిలో చేపట్టిన ఉపాధి పనులను పరిశీలించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో కేవలం నాలుగు గ్రామాల్లో 160 మందికి మాత్రమే ఉపాధి హామీ పనులు కల్పించారన్నారు. మిగిలిన 23 గ్రామాల్లో కనీసం ఒక్కరికి కూడా పని కల్పించిన పాపాన పోలేదన్నారు. అదేవిధంగా విడపనకల్లు మండలంలో రెండు గ్రామాల్లో 35 మందికి, వజ్రకరూరు మండలంలో రెండు గ్రామాల్లో 45 మందికి మాత్రమే పనులు కల్పించారన్నారు. ఉపాధి హామీ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి దాపురించిందన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈనెల 20, 21న సచివాలయాల ముందు ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలిపారు. అప్పటికీ స్పందించకపోతే ఏప్రిల్ మొదటి వారంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి, జిల్లా నాయకులు ముష్టూరు వెంకటేశులు, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు మురళి, రవి, బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : జాతీయ ఉపాధి హామీ పథకం కింద పని చేస్తున్న కూలీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వి.నిర్మల డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన స్కూటర్ యాత్రలో భాగంగా మండలంలోని మామిళ్లచెరువు గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వి.నిర్మల మాట్లాడుతూ గ్రామంలో ఉపాధి కూలీలకు మూడు నెలల నుంచి 8 వారాలు చేసిన పనులకు బిల్లులు చెల్లించలేదన్నారు. పనుల వద్ద కనీస సౌకర్యాలు, పనిముట్లు లేవన్నారు. ఆయా సమస్యలను పరిష్కరించకపోతే ఈనెల 20, 21వతేదీల్లో గ్రామ సచివాలయాల వద్ద ఆందోళనలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు వెంకటలక్ష్మి, రంజిత్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : స్కూటర్ యాత్రలో భాగంగా మండల కేంద్రంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీల సమస్యలను ఎపి రైతుసంఘం నాయకులు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దస్తగిరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, కూలీలు, తదితరులు పాల్గొన్నారు.


ఉరవకొండలో ర్యాలీగా వెళ్తున్న ఎపి రైతుసంఘం నాయకులు

'ఉపాధి'కి రెండు దశాబ్దాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



నిత్యం కరువులకు నిలయమైన అనంతపురం జిల్లాలో బతుకుదెరువు కోసం వలస బాటలు జరిగేవి. వాటిని నివారించాలన్న అనేక డిమాండ్ల మేరకు 2004లో వామపక్షాల మద్దతుతో ఏర్పడిన యుపిఎ-1 ప్రభుత్వ హయంలో ఉపాధి హామీ చట్టాన్ని చేయడం జరిగింది. పని కావాలని కోరే ప్రతి ఒక్క గ్రామీణ ప్రాంతవాసికి పని కల్పించాలన్నది ఈ చట్టాన్ని చేయడం జరిగింది. దీన్ని రూపొందించి 2004లో ప్రారంభించారు. అది కూడా అనంతపురం జిల్లాలోని నార్పల మండలంలోని బండమీదపల్లి గ్రామంలో ప్రారంభమైంది. అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అప్పుడు ప్రారంభమైన ఈ ఉపాధి హామీ పథకం గ్రామీణ ప్రాంతంలోని వ్యవసాయ కూలీల జీవన విధానంలో ఎన్నో మార్పులు తీసుకొచ్చింది. అప్పటి వరకు పని కావాలంటే కూలీ చాలా తక్కువగా ఉండేది. అది కూడా పూర్తి స్థాయిలో పనులుండేవి కావు. ఈ పథకం అమల్లోకి వచ్చాక కూలీలకు కొంత ఊరటనిచ్చింది. వలసలు కొంత వరకు నివారించగలిగిందనే చెప్పవచ్చు. అయితే క్రమక్రమంగా ఈ పథకాన్ని నీరుగార్చే చర్యలను గత కొన్ని సంవత్సరాలుగా ఎన్డీఏ ప్రభుత్వం చేపడుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిధుల కేటాయింపులు కూడా అదే రకంగా తగ్గిపోతూ వస్తున్నాయి. జిల్లాలో ఉపాధి హామీ పథకం కోతలు తప్పడం లేదు. ఈ ఏడాది కూడా సగటున 50 రోజుల్లోపు పని దినాలు మాత్రమే పని కల్పించడం జరిగింది. ఆ నిధుల వినియోగంలో పెద్దఎత్తున సిమెంటు రోడ్లు, భవనాల నిర్మాణాలకు వినియోగిస్తుండటం గమనార్హం. అసలు లక్ష్యాన్ని నీరుగార్చే విధంగా అమలు తీరు ఉంటోంది. దీనికోసం ఇప్పుడు సమస్యలను అధ్యయనం చేయడానికి ఎపి వ్యవసాయ కార్మిక సంఘం సిద్ధమైంది. ఈ వారంలో జిల్లాలో అన్ని మండలాల్లోనే స్కూటర్ యాత్ర ద్వారా ఉపాధి హామీ పథకం అమల్లో వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. ఇందులో వస్తున్న ప్రధాన సమస్యల్లో పది వారాలైన అందని బిల్లుల ఉంటున్నాయన్నది వస్తోంది. అదే విధంగా పథకంలో పేర్కొన విధంగా పనిచేసే ప్రాంతంలో నీడ, నీటి సౌకర్యాలుంటం లేదు. ఈ సమస్యలు పరిష్కారం కోసం వచ్చే వారంలో సచివాలయాల వద్ద నిరసనలకు సిద్ధమైంది. ఏది ఏమైనా ఈ పథకం అమల్లోకి వచ్చినప్పటి నుంచి జిల్లా గ్రామీణ ప్రాంతంలోని వ్యవసాయ కూలీల్లో కొంత మనోధైర్యం నింపిందని చెప్పవచ్చు. దీన్ని మరింతగా విస్తరించాలన్న డిమాండ్ చేస్తున్నారు. నగరాల్లో ఇటువంటి పథకాన్ని ప్రారంభించాలన్న డిమాండ్ వస్తోంది. ఇక ఈ వారంలో వైసిపి, జనసేన ఆవిర్భావ దినోత్సవాలు జరిగాయి. వైసిపి యువతపోరుతోనూ నిరసన ప్రదర్శన నగరంలో చేపట్టింది. నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

'కాలవ' ప్రజాదర్బార్‌కు అనూహ్య స్పందన

ప్రజాశక్తి-రాయదుర్గం

విప్ కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో శనివారం రాయదుర్గంలోని టిడిపి కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌కు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఈ సందర్భంగా ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చి ఫిర్యాదులు అందజేశారు. ఇందులో భాగంగా విప్ కాలవ శ్రీనివాసులు స్వయానా దరఖాస్తుదారులతో మాట్లాడి వినతులను స్వీకరించారు. ఎక్కువగా భూ వివాదాలు, రేషన్ కార్డులు, పింఛన్, నివాస గృహాలు, స్థలాలు, విద్యుత్ లోవోల్టేజ్ సమస్యలతోపాటు రెవెన్యూ అంశాలకు సంబంధించిన దాదాపు 223 వినతులు అందాయి. ఆయా ఫిర్యాదులను స్వీకరించిన కాలవ శ్రీనివాసులు వినతులను సంబంధిత అధికారులకు అందజేసి త్వరితగతిన సమస్యలకు పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, టెంకశాల హనుమంతు, నాగల్లి వెంకటేశులు, రాయదుర్గం మండల కన్వీనర్ హనుమంతు, ఎన్.వెంకటేసులు, తదితరులు పాల్గొన్నారు.

భారీగా తరలివచ్చిన ఫిర్యాదుదారులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

బొమ్మనహాల్ మండల కేంద్రానికి చెందిన కొత్తపల్లి విమలకు మంజూరైన రూ.6లక్షలు సీఎం సహాయనిధి చెక్కును విప్ కాలువ శ్రీనివాసులు బాధితురాలికి అందజేశారు. అలాగే డి.హీరేహాల్ మండలం పులకుర్తి గ్రామం కె హనుమంతప్పకు రూ.45,800, మహిళ స్వయం సహాయక సంఘాలకు రూ.18,50,000 లక్షల చెక్కును అందించారు.

ఎమ్మెల్యేకు సత్కారం

విప్ కాలవ శ్రీనివాసులను రాయదుర్గం వాల్మీకి సంక్షేమ సేవాసంఘం అధ్యక్షులు బండి కిష్టప్ప, ఉపాధ్యక్షులు మల్కన్న తదితరులు శనివారం ఘనంగా సత్కరించారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే విషయమై అసెంబ్లీలో ప్రస్తావించినందుకు కాలవ శ్రీనివాసులుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ హమాలీ యూనియన్ ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

పుట్లూరు : నియోజకవర్గ పరిధిలోని పేదలకు మంజూరైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ శనివారం అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఊరటనిస్తోందన్నారు. పేదలను ఆర్థికంగా ఆదుకుంటున్న ఘనత సిఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు.


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

యల్లనూరు : మండలంలోని కల్లూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆదివారం 33/11కెవి లైన్లను మరమ్మతులు చేస్తున్న కారణంగా ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎఇ రవీంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో సబ్‌స్టేషన్ పరిధిలోని కల్లూరు, వెంకటంపల్లి, మల్లగుండ్ల, లింగారెడ్డిపల్లి గ్రామాల ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

పాముకాటు బాధితుడికి ఆర్థికసాయం

కళ్యాణదుర్గం రూరల్ : పాముకాటుతో కాళ్లు కోల్పోయిన బాధితుడికి ఇన్నిసెంట్ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ బద్దేనాయక్ శనివారం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. కుందుర్పి మండల కేంద్రానికి చెందిన రాము బోరు బండికి వెళ్లేవాడు. ఈనేపథ్యంలో ఎడమ కాలికి పురుగు(పాము) కుట్టడంతో డాక్టర్లు కాలు తొలగించారు. విషయం తెలుసుకున్న బద్దేనాయక్ ఆర్థికసాయం అందజేశారు.

'పది' పరీక్షలకు సర్వం సిద్ధం

బొమ్మనహాల్ : మండలంలో త్వరలో జరగనున్న పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు మండల విద్యాధికారి మల్లికార్జున శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని జెడ్పీ హైస్కూల్, జూనియర్ కళాశాల, ప్రతిభ స్కూల్‌లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈమేరకు ఆయా కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

బ్రహ్మసముద్రం : వచ్చే సోమవారం నుంచి నిర్వహించనున్న పదో తరగతి పరీక్షలకు సర్వ సిద్ధం చేసినట్లు ఎంఇఒలు కృష్ణానాయక్, ఓబులపతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా 8 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉండగా వేపులపర్తి, గుండగానిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు తప్ప ఈ కేంద్రానికి సంబంధించిన విద్యార్థులు గుమ్మగట్ట మండలంలో పరీక్షలు రాయాల్సి ఉంటుందన్నారు. తక్కిన నాలుగు క్లస్టర్ల పరిధిలో 8 ఉన్నత పాఠశాలకు సంబంధించి బ్రహ్మసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

రాయదుర్గం : పట్టణంలోని సేవా భారత్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు గంగాధర్ సహకారంతో శనివారం పట్టణంలోని కస్తూరిబా బాలిక విద్యాలయం పాఠశాల విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి విప్ కాలవ తనయుడు కాలవ భరత్ హాజరై విద్యార్థులకు సామగ్రి అందించారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కొట్రేష్, పాఠశాల ప్రత్యేక అధికారిణి వెంకటలక్ష్మి, ఎఐవైఎఫ్ తాలూకా అధ్యక్షులు కుమార్, ఆకలి బంధం సేవా సంస్థ అధ్యక్షులు నాగయ్య, విద్యార్థినులు పాల్గొన్నారు.

చాగల్లు జలాశయంలో చేప పిల్లలు విడుదల


చేప పిల్లలకు వదులుతున్న ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి

పెద్దపప్పూరు : మండలం పరిధిలోని చాగల్లు జలాశయంలో ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి శనివారం చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధి కోసం దాదాపు 2.93లక్షల చేప పిల్లలను వదిలినట్లు తెలిపారు. చేప పిల్లల విడుదలతో మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శివబాలాజీ, వీఆర్వోలు, టిడిపి నాయకులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా : జెసి

పెద్దవడుగూరు : టిడిపి కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే జెసి ప్రభాకర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. శనివారం మండల పరిధిలోని కోటకొండ ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. అనంతరం జెసి మాట్లాడుతూ కార్యకర్తకు ఏ కష్టం వచ్చినా అర్ధరాత్రి అయినా ఫోన్ చేస్తే ఆదుకునేందుకు సిద్ధంగా ఉంటానన్నారు. ఆయనా వెంట మండల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

నార్పల : మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో మార్చి 1 నుంచి నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిసినట్లు ప్రిన్సిపాల్ బాలప్ప తెలిపారు. ఈ కేద్రంలో నార్పల జూనియర్ కళాశాల విద్యార్థులతోపాటు బి.పప్పూరు, కస్తూరిబా గాంధీ విద్యార్థులు పరీక్షలు రాసినట్లు తెలిపారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

పుట్లూరు : విద్యుదాఘాతంతో ప్రయివేట్ కరెంట్ కార్మికుడు మృతిచెందిన ఘటన శనివారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పుత్తూరుకు చెందిన ప్రయివేట్ కరెంట్ పని చేసే కార్మికుడు మునిరెడ్డి (40) రైతు తోటలో ఎగ్జ్‌ఫ్యూజు పోవడంతో వేసేందుకు వెళ్లాడు. ఫీజు వేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై స్తంభం పైనుంచి పడి అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రి తరలించినట్లు ఎస్ఐ వెంకట నరసింహ తెలిపారు. మృతునికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో అంగన్వాడీ ఆయా మృతి

కళ్యాణదుర్గం రూరల్ : మున్సిపాలిటీలో పరిధిలోని గూబనపల్లి గ్రామం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అంగన్వాడీ ఆయా మృతిచెందింది. బెళుగుప్ప మండలంలోని నరసాపురం గ్రామానికి చెందిన లక్ష్మీ అంగన్వాడీ ఆయాగా పని చేస్తోంది. ఈనేపథ్యంలో మున్సిపాలిటీలో పరిధిలోని గూబనపల్లి గ్రామ సమీపంలో భర్తతో కలిసి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా డివైడర్‌ను ఢీకొన్నారు. దీంతో లక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నలుగురిపై కేసు

పుట్లూరు : వ్యక్తిని గాయపరిచి ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటనరసింహ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. గరుగు చింతలపల్లి గ్రామానికి చెందిన నాగరాజుని కట్టెతో గాయపరిచిన ఘటనలో నవీన్, నాగేంద్ర, లక్ష్మయ్య, సుబ్బయ్యపై మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అరటితోట దగ్ధం

ఆత్మకూరు : మండల కేంద్రంలోని సర్దికూటి నాగభూషణ్‌రెడ్డికి చెందిన అరటి తోటకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో దగ్ధమైంది. నాలుగు ఎకరాల్లో పంట దగ్ధం కావడంతో సుమారు రూ.లక్ష వరకూ నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు. గమణించిన గొర్రెల కాపరులు వెంటనే ఫోన్ ద్వారా రైతులకు సమాచారం ఇవ్వడంతో ఆయన వచ్చి మంటలను అదుపు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఆశావర్కర్‌కు గాయాలు

శింగనమల : మండల కేంద్రంలోని మహిళా హెల్త్ సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న ఆశావర్కర్ పద్మావతి శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడింది. పద్మావతి సలకంచెరువు నుంచి శింగనమలకు వ్యాక్సిన్ తీసుకొస్తుండగా చిన్న మట్లగొంది వద్ద ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడి తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు శింగనమల సిహెచ్‌సికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం చికిత్స కోసం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పరిసరాల పరిశుభ్రత పాటిస్తేనే ఆరోగ్యం

ప్రజాశక్తి-అనంతపురం

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎస్‌వి డిగ్రీ, పీజీ కళాశాల వైస్‌ఛైర్మన్ సి.చక్రధరరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఎస్‌వి డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటేనే మనం ఆరోగ్యంగా ఉంటామన్నారు. అనంతరం కళాశాల పరిసరాలలో ఉన్న పొడి చెత్త, తడి చెత్తను వేరు చేసి శుభ్రం చేశారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్ఎవి ప్రసాద్, జాతీయ సేవా పథకం పిఒలు జి.ఆనంద్‌బాబు, ఎస్.పురుషోత్తం, విద్యార్థులు పాల్గొన్నారు.

'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' కార్యక్రమాల్లో వక్తలు



రాయదుర్గంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

నార్పల : ప్లాస్టిక్‌ను నిషేధించి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎంపిడిఒ గంగావతి పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంతోపాటు గూగూడులో సచివాలయాల సిబ్బందితో కలిసి ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గూగూడులో ఎంపిడిఒ ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించారు. అలాగే ఎంపిడిఒ కార్యాలయంలో కార్యాలయ పర్యవేక్షకురాలు ఉమాదేవి ఆధ్వర్యంలో కార్యాలయ పరిసరాలు పరిశుభ్రం చేశారు. నార్పల సంతలో ప్లాస్టిక్ వినియోగంపై వినియోగదారులకు అవగాహన కల్పించారు. అలాగే మండల పరిధిలోని సిద్ధరాచర్ల పంచాయతీలో సర్పంచు సాకే రామాంజనేయులు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఇఒఆర్‌డి శైలజారాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ జనార్ధన్, ఉపాధి హామీ ఎపిఒ రమేష్, పంచాయతీ కార్యదర్శులు శ్యామల, శ్రీనివాసులు, పరశురాం, చరణ్, శ్రీనివాస్, వెంకటరమణ, గోపాల్‌రెడ్డి, లక్ష్మీదేవి, వరలక్ష్మి, రాజేశ్వరి, కీర్తన, కుల్లాయప్ప, చిన్న రాయుడు, మాధవి, మల్లికార్జున, చంద్ర, శిరీష, ఆదినారాయణ, కుళ్లాయిస్వామి, వార్డు మెంబర్ నాగభూషణం సచివాలయల సిబ్బంది పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఎస్‌విజిఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో శనివారం ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా విద్యార్థులు, అధ్యాపకులు, మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయరామ్‌రెడ్డి, హిందూపురం ఎస్ఎస్‌పిఆర్ ప్రభుత్వ డీగ్రీ కళాశాల (మహిళ) ప్రిన్సిపాల్ ప్రగతి, అధికారులు శ్రీధర్, రవిశంకర్, శైలజ, జోష్ణ, కవిత, ప్రభావతి, షోకత్ అలీ, రాధాకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలో ప్లాస్టిక్‌పై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ప్లాస్టిక్ రహిత స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా కృషి చేద్దామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శకుంతల, తహశీల్దార్ బాలాజీరాజ్, ఎస్ఐ నాగేంద్రప్రసాద్, ఎంఆర్‌పిఎస్ నాయకులు ఆదినారాయణ, సిపిఐ నాయకులు చింతా పురుషోత్తం, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రాయదుర్గం : స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని కూరగాయల మార్కెట్ వద్ద స్వచ్ఛతపై వ్యాపారులు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను నిషేధించాలని, తడిచెత్త - పొడిచెత్తను వేరు చేసి కార్మికులకు అందించాలని సూచించారు. అనంతరం ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ దివాకర్‌రెడ్డి, వార్డు సభ్యులు ప్రశాంతి, జ్యోతి, గోవిందరాజులు, శ్రీనివాసులురెడ్డి, మాజీ మున్సిపల్ వైస్‌ఛైర్మన్ వెంకటేశులు, కో ఆప్షన్ సభ్యులు నజీర్, మాజీ వార్డు సభ్యులు ధనార్జన, తదితరులు పాల్గొన్నారు. అనంతరం బళ్లారి రోడ్డు ఆంజనేయ స్వామి గుడి వద్ద సింగిల్ యూస్ ప్లాస్టిక్ గురించి వ్యాపారులు, హోటల్ యజమానులకు అవగాహన కల్పిచారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాళుశిల్ప, వైసిపి వార్డు ఇన్‌ఛార్జి పొరాళుశివ, భీమనపల్లి దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండల వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ర్యాలీలు, మానవహారాలు ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జి.లక్ష్మీనరసింహ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ శివకుమార్, ఇఒఆర్‌డి కామక్క, ఎపిఒ సుజాత, హైస్కూల్ హెడ్మాస్టర్ కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్షను రూపుమాపుదాం

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

బాల్య వివాహాలను నిర్మూలించడంతోపాటు లింగ వివక్షను రూపుమాపుదామని ఆరోగ్య విద్యా బోధకురాలు పర్వీన్ పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని రోటరీపురం గ్రామంలో బాల్య వివాహాలను అరికట్టాలన్న నినాదంతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల అనేక దుష్పరిణామాలు ఎదురవుతాయన్నారు. కావున యువతీ, యువకులకు వయస్సు వచ్చిన తర్వాతనే వివాహం చేయాలన్నారు. అలాగే ఆడ, మగ సమానమే అన్నారు. లింగ వివక్ష చూపకూడదన్నారు. లింగవివక్ష చూపితే చట్టరీత్యా నేరమన్నారు. శిక్షార్హులు అవుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో యానిమేటర్ సుజాత, కమిటీ కోఆర్డినేటర్, లీడర్లు, ఎంఎల్‌మెచ్‌పి, ఎఎన్ఎం, తదితరులు పాల్గొన్నారు.

కాన్షీరామ్‌కు నివాళి

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

బహుజన సమాజ్‌వాది పార్టీ వ్యవస్థాపకులు కాన్షీరామ్ జయంతిని పురస్కరించుకుని శనివారం జిల్లాకేంద్రంలో నివాళులర్పించారు. రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఆర్ఇఎఫ్) ఆధ్వర్యంలో కేక్ కోసం సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఇఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.నారాయణనాయక్, రాష్ట్ర కో కన్వీనర్లు ఎం.ఓబులేసు, బి.నారాయణప్ప, ఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు వైఆర్ బాలరాజు, బీసీ టీచర్స్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరప్ప, ఎస్సీ, ఎస్టీ ఇడబ్ల్యూఎ జిల్లా అధ్యక్షులు కటిక జయరామ్, బిసి సంక్షేమ సంఘం తలారి విష్ణు, రాయలసీమ కో కన్వీనర్ ఎ.నాగభూషణం, ఆర్ఇఎఫ్ జిల్లా అధ్యక్షులు టి.రాజారమేష్, లాయర్ హరిప్రసాద్, జిల్లా కన్వీనర్ ఆర్.మహేష్‌నాయక్, భార్గవ్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు కాన్షీరామ్ జయంతిని పురస్కరించుకుని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిందనూరు నాగరాజు ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్‌జిఒ భవన్‌లో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముందు కేక్ కోసం పంచిపెట్టారు. అనంతరం రాయదుర్గం, గుమ్మగట్ట మండలాలకు చెందిన 43 మంది బీఎస్పీలో చేరారు. వీరికి నాగరాజు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ కార్యదర్శి రామాంజనేయులు, అధ్యక్షులు జయచంద్ర, కన్వీనర్ కృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.